# నేల రాలిన వసంతం

అది అసుర సంధ్య. వసంతకాలం. ఎక్కడ చూసినా విరబూసిన పూల చెట్లు. రంగురంగుల దుప్పటికప్పుకున్నట్లుగా వుంది ప్రకృతి. భగభగమండే అగ్ని బాణంలా పడమటి కొండల్లోకి దూసుకుపోతున్నాడు సూర్యుడు. చిటికెడు పొట్టకోసం పగలంతా తిరిగితిరిగీ అలసిపోయిన పక్షులు తమ తమ నెలవులకు చేరుకుంటున్నాయి. మేతకు వెళ్ళిన పశువులు క్రమంగా ఊళ్ళోకి అడుగుపెడుతున్నాయి. వాటితో బాటుగా కోకిలన్న బావిలో పడి చచ్చిపోయాడన్న వార్తా ఆ ఊర్లో అడుగు పెట్టింది. క్షణంలో ఊర్లో ప్రజలంతా అక్కడ చేరి పోయారు.

ఆ బావి, మామిడితోట మధ్యలో వుంది. అప్పటికే కోకిలన్న శవాన్ని బావిగట్టుకు చేర్చారు.

◆ ◆ ◆ ◆

పాపం కోకిలన్న ... కోకిలన్నది ఒక విచిత్రమైన మనస్తత్వం. వసంతం అంటే అతనికి భయం. ఒక్క భయమేకాదు. కోపం, ద్వేషం, పగ, అతని అంతరాంతరాల్లో వసంతాన్ని కాల్చి, మసి చేసేయాలన్నంత కసి. కోకిల కంఠం వింటేనే చాలు. అతని హృదయాన్నెవరో బలవంతంగా చేతిలోకి తీసుకుని పిడికిలితో పిసికేస్తున్నట్లు బాధపడిపోతాడు. దానిపేరెత్తితేనే అతని మనసు విలవిలలాడిపోతుంది. అందరికీ ఇష్టమైన కోకిలస్వరం అతన్ని ఆవేదనా సముద్రంలో ముంచేస్తుంది. అందరికీ శుభాన్ని కలిగిస్తుందని నమ్మే కోకిల అతనికి మాత్రం ఒక అపశకుని పక్షి. అందరినీ అలరించే వసంతం అతనికి మరుభూమిలాంటిది.

అన్ని ప్రదేశాల్లో లాగానే, ఆ ఊరికి ఉత్తరానుండే మామిడి తోటలోకి, అయిదు ఋతువుల ఆర్భాటాన్ని చీల్చుకుని, అందంగా ఆహ్లాదాన్ని తొడుక్కుని అక్కడికీ ప్రతి సంవత్సరం వస్తుంది వసంతం. ప్రకృతిని అలంకరిస్తుంది. మామిడి చిగుళ్ళను తిని నెమకిన కోకిల కంఠంలో సంవత్సరం పొడుగునా ఘనీభవించిన మౌనాన్ని చీల్చుకుని అమృతపు జల్లులా కుహూ రాగం పుట్టుకొస్తుంది. ప్రపంచాన్ని జోకొడుతుంది. అది విన్న ప్రతిసారీ కోకిలన్న మెదడులో జ్ఞాపకాల పొరలు చీల్చుకుని భరింపరాని బాధ సముద్రపు కెరటంలా పైకెగసివస్తుంది.

కోకిల కూత వినిపిస్తే చాలు. కోకిలన్న కర్రను చేతబట్టుకుంటాడు.

"అదే నా బతుకును బండలేసింది. నా జీవితాన్ని చీకటి చేసింది ఆ పాటే." అని గొణుక్కుంటూ తోటంతా తిరుగుతాడు. దొరికితే చాలు చంపేయాలనుకుంటాడు. దాని ఈకలు పీకి ప్రాణంతోనే కాల్చికోసి కూరొండుకు తినేయాలన్నంత కసి అతనికి.

ఒక్క కోకిల కంఠాన్ని అంతం చేసినంత మాత్రాన లోకంలో కోకిలలే లేకుండా పోతాయా? లక్షల కోకిలకంఠాలు ప్రకృతిలో ప్రతిధ్వనించకుండా వుంటాయా?

◆ ◆ ◆ ◆

కోకిలన్న అసలు పేరు తిమ్మగాడు. ఎనిమిదో తరగతి పూర్తి కాకుండానే అతని తండ్రి చదువు ఆపించేశాడు. మేకలు కాసేవాళ్ళు లేకపోవడంతో మేకల కాడికి వేశాడు. ఇది సరిగ్గా ముప్పై ఎనిమిది సంవత్సరాల మాట అప్పుడతని వయస్సు పన్నెండేళ్ళు. ఇప్పుడున్న వసంత ద్వేషం కానీ, కోకిల ద్వేషం కానీ అప్పుడతనికి లేవు. పైగా ఆ వయసులో ఆతను ప్రకృతి ఆరాధకుడు. వసంత కాలం వచ్చిందంటే ఆతనికి పండుగే. వసంత కాలంలో ఆతని మనసు ఎక్కడికో తేలిపోతుంది. ఏ స్వప్న లోకాలకో ఎగిరిపోతుంది.

మేకలే అతని నేస్తాలు. మేకలే అతని ఆత్మీయులు. మేకలే ఆతని బంధువులు మేకలు అతని ప్రాణం. ఆతని ఆనందాలని, ఆవేదనల్ని ఆ జీవాలతోనే చెప్పుకుంటాడు. అవి అర్థం చేసుకున్నట్లు చెవులాడిస్తే ఆనందపడిపోతాడు. ఆతని ఆటాపాటా కూడా మేక పిల్లలతోనే. ఆ జీవాలు, తానూ అన్నీ ప్రకృతిలో భాగాలే అనుకుంటాడు.

అతను ఉదయాన లేస్తాడు. ఈనిన మేకల్ని తోలుకొని అలా పొలాల గట్టుల్లో మేపుకు వస్తాడు. ఆ తర్వాత పళ్ళుతోముకుని స్నానం చేస్తాడు. ఆ తర్వాత మేకల దగ్గర పిల్లలకు పాలు తాపిస్తాడు. ఆపైన నడవలేని పిల్లల్ని దొడ్లోనే వదిలేస్తాడు. చిక్కంలో సద్దన్నం కట్టుకొని. మేకల్ని తోలుకుని అడవికి పోతాడు. మధ్యాహ్నం ఏ బావి గట్టునో, లేదా ఏ చెరువు గట్టునో చద్దన్నం తింటాడు. మేకల్ని మేపుకుంటూ, వాటిని గుంపుగా మళ్లేసుకుంటూ జాగ్రత్త పడతాడు.

అతను మేకలు మేపుతూ చెట్ల నీడల్లో రాలిన పుష్పాలపైన మైమరచి దొర్లుతాడు. పూల వాసనలు మోసుకు వచ్చే మలయమారుతం అంటే ఆతని కిష్టం. తన గాన మాధుర్యంతో లోకాన్ని మరపించే కోకిల గానమంటే ఆతనికి ప్రాణం. అవి రెండూ ఆతన్ని పిచ్చి వాణ్ణి చేస్తాయి. ఆకాశంలో ఎగిరే విమానాన్ని చూసి కేరింతలుకొడతాడు. ఆకాశంలో ఎగిరే పక్షిని అలాగే చూస్తూ తన ఊహలకి రెక్కల్ని తొడుక్కుంటాడు. రివ్వున పైకెగురుతాడు. ఆకాశంలో తేలిపోతూ మేఘాలతో ఆడుకుంటూ ఏవోలొల్లాయి పదాలు కట్టి పాడుకుంటాడు. కోకిల గానంతో పోటీ పడాలని చూస్తాడు. కోకిల గానమంటే ఆతనికి అభిమానం, ఆరాధన, భక్తి. ఈ ప్రకృతి ఆరాధనే ఒక్కోసారి ఆతనికి తంటాలు కూడా తెచ్చి పెట్టేది. అయినా ఆతను లెక్కచేసేవాడు కాదు.

"వరేయ్. ఇంత పరధ్యానం, అయోమయం పనికి రాదురా అబ్బాయ్" అంటూ ఎవరైనా హెచ్చరించినప్పుడల్లా ప్రకృతిని మరచి పోవాలనుకుంటాడు. కానీ అది ఆతని చేతనయ్యేది కాదు. ఎన్నోసార్లు ప్రయత్నించి ఓడిపోయాడు. ఒకసారి అతను అడవి మొగదల మేకలు మేపుకుంటున్నాడు. ఇంతలో ఆతని చెవులకు మధురమైన కోకిల గానం వినిపించింది. వెంటనే అది అరచినట్లే తనూ అరుస్తూ దాని గానాన్ని ఆస్వాదిస్తూ మేకల్నే కాదు, ఈ ప్రపంచాన్నే మరచిపోయాడు.

మేకలన్నీ పక్కనేవున్న పొలాల్లో పడ్డాయి. పంటను మేయసాగాయి. అది గమనించిన ఆ పొలం యజమాని పచ్చి బూతులు తిడుతూ ఆతన్ని నాలుగుతన్నాడు. మేకలన్నింటినీ గుంపుగా

తోలుకువెళ్ళాడు. బందలదొడ్లో తోలేశాడు. గత్యంతరం లేక అతని తండ్రి మేకకు రెండు రూపాయలు చొప్పున అపరాధం కట్టి మేకల్ని విడిపించుకున్నాడు. ఇక ఆ రాత్రి అతని వీపు చిట్లిపోయేదాకా బెత్తానికి పని కల్పించాడు అతని తండ్రి.

ఇలా వుండగా వసంతకాలంలో ఒకరోజు ఉదయాన చద్ది నీళ్ళు తాగి చద్దన్నం కట్టిన చిక్కెం భుజానికి తగిలించుకున్నాడు. మేకలకు ఆకులు కోసే దోటి కట్టెను చేతబట్టుకున్నాడు. ముఖానికి ఎండ తగలకుండా తలగుడ్డ చుట్టుకున్నాడు. మేకల దొడ్డి తెరిచాడు. అన్నింటినీ తోలుకొని ఆ ఊరికి రెండు మైళ్ళ దూరంలో వుండే అడవికి బయలుదేరాడు. అదే అతని జీవిత గమనాన్ని మార్చిన రోజు. అతని బతుకును చీకటి మయం చేసిన రోజు.

ఆ రోజు మధ్యాహ్నం వరకు మేకలు మేపాడు. కడుపులో గోకట ఆరంభమైంది. తోటి పశువుల కాపర్లతో చెప్పి అక్కడే వున్న ఒక దిగుడు బావి దగ్గరికొచ్చాడు. ఆ బావి చుట్టూ కానగ చెట్లు, ఏ గంధర్వులో శాపవశాత్తు వృక్షాలుగామారి పోయారాన్నంత గంభీరంగా ఎత్తుగా సీమరాల చెట్లు. బావికి ఒక వైపు గడ్డమీద రెండు ఊడగ చెట్లు ఎత్తుగా పెరిగివున్నాయి. మరో వైపున ఒక పెద్ద బూరుగు చెట్టుంధి. నేలపైన ముళ్ళ పొదలు దట్టంగా బలుసుకుని వున్నాయి. భూమమ్మ శరీరంపైన లేచిన పుండ్లలా అక్కడక్కడా నాగదారిముండ్లు. వసంత కాలం కావడంతో అక్కడి వాతావరణం ఎంతో చల్లగా వుంది. ఆహ్లాదకరంగా వుంది. వాటిని చూసి మురిసిపోతూ చిక్కెంచేత బట్టుకొని బావిలోకి దిగాడు తిమ్మగాడు. బావి నీళ్ళతో చేతులు శుభ్రం చేసుకుని వచ్చి చిక్కెం విప్పాడు. అన్నం మధ్యలో వున్న కూర బుడిగెను తీసిపక్కన పెట్టాడు.

అన్నం గుడ్డతోసహా బయటికి తీసి, అన్నం నేలపైన పెట్టుకున్నాడు. బుడిగెలో కూర వంపుకొని అన్నం తిన్నాడు. చేయి కడుకున్నాడు. ఆ తర్వాత అన్నం గుడ్డను నీళ్ళలో పులిమి శుభ్రం చేశాడు. బుడిగెను కడిగాడు. ఆ రెంటినీ తీసిమళ్ళీ చిక్కెంలో పెట్టాడు. ఆ చిక్కెం చేతబట్టుకొని పైకి వచ్చాడు.

ఇంతలో కానగ చెట్టు ఆకులమాటున దాగి వుండి, ఉన్నట్టుండి 'కూఁహూఁ' అంటూ కూత వేసింది కోకిల. ఆ కూతవిన్న తిమ్మగాడి చిన్నారి మనసు పరవశించింది, ఆనందంతో పరవళ్ళు తొక్కింది. ఆ చెట్లవైపు చూశాడు. అది కనిపించలేదు. ప్రతి చెట్టును చూశాడు. ప్రతి పొదను చూశాడు. అక్కడి ప్రకృతి ఆ ఎండలో పదహారేళ్ళ కన్నెపిల్ల తలార స్నానం చేసి కురులు ఆరబెట్టుకుంటున్నట్టనిపించింది. స్వచ్ఛంగా హోయలుపోతూ కనిపించింది. ఇంతలో మళ్ళీ కోకిల కూత! మరోసారి అతని హృదయం ఆనందంతో పొంగిపోయింది. ఈ పక్షులు, వాటి కిలకిలా రావాలు, ఆ కోకిళ్ళ గానాలు, ఈ వసంతాలు ఈ లోకానికి ప్రకృతి యిచ్చిన వరాలు కదా అనుకున్నాడు. మానవ జన్మ ఎత్తడమే పూర్వజన్మసుకృతం అనుకుంటే, ఈ ప్రకృతి కన్నులార చూడడం, మనసార ఆనందించడం. అంతకంటే మహా సుకృతం అనుకున్నాడు.

ఆ కోకిల పదే పదే అరవసాగింధి. ఆ గానం ఆ అడవిలో ప్రతి ధ్వనించసాగింది. అడవి

మీద అలలు అలలుగా ప్రవహిస్తూ, అడవిని ముంచెత్తుతోంది. చెవులున్నందుకు ఇప్పుడు కదా సాఫల్యం ఏర్పడింది అనుకున్నాడు. తిమ్ముగాడూ దాన్ని అనుకరిస్తూ అరిచాడు. అది విన్న కోకిల రెట్టింపుగా అరవసాగింది.

'కుహూ కూఁహూ' అతను వెక్కిరించాడు. మళ్ళీ కోకిల 'కూహూఁ'తిరిగి అతను కూఁ హూఁ

"కూఁహూఁ" ... "కూఁహూఁ"

"కూఁహూఁ ... కూఁహూఁ"

కోకిల అతను ... అతను కోకిల ...

ఇలా చాలా సేపు సాగిన తర్వాత ఎప్పుడూ కోకిలను చూసి ఎరుగని అతని మనసు దాన్ని చూడాలని ఉవ్విళ్ళూరింది. ఆతనికిలో పికసందర్శనాసక్తి పెరిగింది. అది కూస్తూనే వుంది. ఈసారి అతను అరవడం మానేసి, అది కూసిన చెట్టు మీద ఒక రాయి విసిరాడు. దాంతో అది తటాలున పైకెగిరి మెరుపులాకనిపించి అంతలోనే కనిపించకుండాపోయింది. మళ్ళీ రాయి విసిరాడతను. అది మళ్ళీ ఎగిరి మరో చెట్లో దాక్కుంది. అది దాక్కున్న చోట ఆకులు సరసరా కదిలాయి. ఆతను చూస్తూనే వున్నాడు. కానీ అది కనిపించలేదు. 'హేయ్' అంటూ అదిలించాడు. అది ఆకుల్లో కదిలీకదలకుండా వుండిపోయింది. ఒక కొమ్మ మీద నించీ మరో కొమ్మ మీదికి కదలిపోయింది. అది అతను గమనించాడు. దీక్షగా చూశాడు. అంతలోనే అది కనిపించకుండాపోయింది. చెట్టు కొమ్మల్లోనే మాయమైన ఆ కోకిలను చూడాలన్నతపన ఆతనిలో ఇంకా ఎక్కువైంది. ఆ బావి వరగడ్డాన వున్న ముళ్ళ పొదల్ని తప్పించుకుంటూ, ఆ కోకిల కనిపించిన వైపు రాళ్ళను విసరుతూ ... దాన్ని చూడాలని ఆత్రుతపడ్డాడు. అయినా అది కనిపించలేదు. ఈసారి అది ఆ గట్టునే వున్న బూరుగ చెట్టు ఆకుల సందుల్లో దాక్కొని ఆనందంగా కూసింది. స్వేచ్ఛగా అరచింది. అతనూ అలాగే అరుస్తూ దాన్ని వెక్కిరిస్తున్నాడు. ఆతని కళ్ళు ఆ చెట్టులోని ప్రతి కొమ్మనూ, ప్రతి రెమ్మనూ వెదికాయి. ప్రతి ఆకునూ అన్వేషించాయి. ఎట్టకేలకు ఆకుల మాటున ఒక కొమ్మ చివర వదిగి కూర్చొని ఈ ప్రపంచానికేదో సందేశమిస్తున్నట్లు అదే పనిగా కూస్తున్న కోకిల ఆతనికి స్పష్టంగా కనిపించింది. బావి వరగడ్డాన నిలబడివున్న అతను వంగి ఒక రాయిని చేతిలోకి తీసుకున్నాడు. గురిచూసి దాన్ని కొట్టబోయాడు. ఆ దెబ్బ తగిలివుంటే ఆ కోకిల కంఠమేకాదు. దాని శ్వాస కూడా ఆగిపోయేదే. దాని ఆయువు అంతమైపోయేదే. కానీ విధివక్రించింది.

కోకిలను కొట్టబోయిన అతను కాలుజారి పక్కనే వున్న నాగదారు ముళ్ళ పొదలో పడి 'అమ్మా' అనికేక పెట్టాడు. ఆ పైన పెద్ద శబ్దం చేసుకుంటూ గుబుళ్ళున బావిలో పడిపోయాడు. ఆతనికి ఈతరాదు. పైగా నీళ్ళంటే చచ్చేభయం. అందుకే ఆతని కేక విని చుట్టు పక్కల వున్న పసులకాపర్లు పరుగున వచ్చారు. ఆతన్ని రక్షించారు. బాగా దెబ్బలు తగిలాయి.

మూలుగుతున్నాడు, వాళ్ళు ఆతన్ని యింటికి చేర్పించి వైద్యం చేయించారు. కొద్ది రోజులకే ఆతనికి సంపూర్ణ ఆరోగ్యమైతే చేకూరింది. కానీ ... నాగదారు ముళ్ళు కళ్ళల్లో గుచ్చుకున్నందున ఆతని చూపు పోయింది. అతను శాశ్వితంగా అంధుడైపోయాడు.

అందుకే ... అప్పటినించీ ఆతనికి వసంతమన్నా, కోకిలగానమన్నా అంతద్వేషం, కసి. ఎక్కడ కోకిల కంఠం వినిపించినా, వెదుకుతూ అక్కడికి వెళతాడు. వెళ్ళి కోకిలగానాన్ని ఆలకిస్తాడు. ఆ పైన భరించలేకపోతాడు. వెంటనే రాళ్ళు విసరుతాడు. దాన్ని పచ్చి బూతులు తిడుతాడు. అతను కోకిల మూలంగా అలా అయిపోయాడు ఎప్పుడూ కోకిల పైన పగతో తిరుగుతుంటాడు. కాబట్టే ఆతన్ని కోకిలన్న అని పిలవసాగారు రానురాను తిమ్మిగాడు అనే అతని అసలు పేరు మరుగున పడిపోయి అతనికి ఆ పేరే స్థిరపడిపోయింది. అంధుడైన కారణంగా ఆ తర్వాత ఆతనికి ఎవ్వరూ పిల్లనివ్వలేదు. ఆతను బ్రహ్మచారిగానే వుండిపోయాడు. అలానే జీవితం గడిపేశాడు.

◆ ◆ ◆ ◆

పగలంతా బాగానే వున్నాడు ... అసలు బావిలో ఎలా పడ్డాడో, ఎలా చనిపోయాడో చాలా మందికి అంతుబట్టలేదు.

"ఎవరో కడుపు మంటతో బాయిలో తోసేసింటారు. ఈత రాని కారణంగా చచ్చిపోయుంటాడు ..." అని కొందరన్నారు.

"ఆఁ ... ఏమ్మాటా ఈ గుడ్డి బతుకు బతకలేక వాడే సాయంగా బాయిలో బడిచచ్చిపోయినాడు" అని మరికొందరన్నారు.

"మావిడి తోటలో కోయిలరస్తావుంటే, అలవాటు ప్రకారం దాన్ని వెదుక్కుంటా వచ్చి, దారి తప్పోయింటాడు. బాయిలోబడి చచ్చి పోయింటాడు." యింకొందరన్నారు.

ఎలాగైతేనేం. ఆతనిప్పుడు మరణించాడు. అయితే కాకుల ముక్కుల దెబ్బలకు చచ్చి శవంగా మారిన ఒక చిన్నారి కోయిల ఆతని పక్కనే పడివుంది.

అది ఎలా చచ్చిందో, అక్కడికి ఎలా వచ్చి పడిందో ఎవరికీ తెలీడంలేదు.

బతికున్నన్ని రోజులూ అంత దగ్గరగా కోకిలను చూడలేని ఆతని కళ్ళు ఇప్పుడు దాని వైపే చూస్తున్నాయి. దాని కళ్ళూ ఆతన్నే చూస్తున్నాయి.

'ఇదేదో జన్మాంతర అనుబంధం' అన్నారు ఎవరో ...

"ఏ ఋణాను బంధమో' అన్నారింకెవరో

అక్కడ చేరినవాళ్ళ కళ్ళకొలకులు అశ్రు బిందువుల్నిస్రవిస్తున్నాయి. ఆ మామిడి తోటలోని ప్రతి చెట్టూ రెండు పువ్వుల్ని నేలరాల్చుకుంటోంది. చివరికి ఆతన్ని పూడ్చే సమయంలో ఆ కోకిలనీ ఆతనితో బాటు వేసి పూడ్చేశారు.

● *14-12-88, ఆంధ్రప్రభ - వార పత్రిక* ●